పోషకాల వరుస.. పనస



వేసవికాలంలో విరివిగా దొరికే పండ్లలో పనస కూడా ఒకటి. పండిన పనస తొనలతో రుచి మాత్రమే కాదు.. ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి. ఇతర పండ్లతో పోల్చితే విటమిన్లు, ఫొలేట్, నియాసిన్, పొటాషియం, మెగ్నీషియం ఎక్కువగా ఉండాయి. దీంట్లో ఉంటే ఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి. అధికంగా ఉంటే ఫైబర్‌తో జీర్ణక్రియ సక్రమంగా జరిగి మలబద్ధకాన్ని నిరోధిస్తుంది. అల్సర్, గుండెపోటు, రక్తపోటు తదితర సమస్యలు దూరమవుతాయి. ఇలా చెప్పుకుంటూ పోతే పనస పండులో అనేక పోషక విలువలుండాయి.

- ఆరోగ్య ప్రదాయిని పనస పండు
- పోషకాలు అధికం
- రోగ నిరోధకశక్తి పెంపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సీజనల్ ఫలాల్లో పనస పండుకు మంచి క్రేజ్ ఉంది. సంవత్సరంలో కొద్దిరోజులు మాత్రమే దొరికే పనస పండు రుచి చూసేందుకు ఆహార ప్రియులు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. ప్రస్తుతం పనస పండ్ల సీజన్ కావడంతో మార్కెట్‌లో జోరుగా విక్రయాలు సాగుతున్నాయి. కడప నగరంలో వై జంక్షన్, ఆర్టీసీ బస్టాండు, కోటిరెడ్డి సర్కిల్, ఐటీఐ సర్కిల్, బిల్టప్ సర్కిల్, ఏడురోడ్లు, అప్సర సర్కిల్, చిన్నచౌకు తదితర ప్రాంతాల్లో పనస పండ్లు విక్రయిస్తున్నారు. పండు రూ. 200-400 వరకు ధర పలుకుతోంది. ఎక్కువ మంది పండ్ల కంటే తొనల లెక్కన కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. విక్రయదారులు పండును కోసి కొనలను పావుకిలో రూ. 50, కిలో రూ. 200 చొప్పున అమ్ముతున్నారు.

దయాబెటిస్‌కు ఉపశమనం

ఈ పండులో విటమిన్లు, ఖనిజాలు, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ఎలక్ట్రోలైట్లు, ఐరన్, పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల ఇది ఇతర పండ్ల కంటే ఎక్కువ పోషకాలను కలిగి ఉంటుంది. జాక్‌ఫ్రూట్‌లో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. దీంతో డయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. అలాగే, పనస పండులో తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

గుండె ఆరోగ్యం..

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పనస పండు సహాయపడుతుంది. దీనిలో పొటాషియం, ఫైబర్ వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. పనసపండుని మితంగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఈ పండు అధిక రక్తపోటును నియంత్రించడమే కాకుండా గుండె సంబంధిత ఇతర ఆరోగ్య సమస్యలనూ నివారిస్తుంది.

జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది..

ఈ పండులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలోముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జాక్‌ఫ్రూట్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, మలబద్ధకం సమస్య దూరమవుతుంది. అలాగే, ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాయి. మన శరీరంలో క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడతాయి. సమతుల ఆహారంలో ఈ పండు ముఖ్యమైనదని, ఈ సీజన్‌లో దొరికే పనస పండు తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఎస్టీ వర్గీకరణ కోసం పోరుబాట

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరించాలని కోరుతూ పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏపీ గిరిజన అభివృద్ధి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కేద్రీ వెంకట శ్రావణ్‌కుమార్, వర్గీకరణ సాధన సమితి ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం రాజ్యాంగ అమలును పక్కాగా నిర్వహించాలని కోరారు. అందులో భాగంగా ఎస్టీ వర్గీకరణ నిర్వహించి సామాజిక న్యాయాన్ని కల్పించాలన్నారు. వర్గీకరణ వల్ల అణగారిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సంఘ నాయకులు ఈశ్వర్, నాగేంద్ర, సిద్దు, వీరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కడపలోని జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రీజియన్ కార్యదర్శి రామమూర్తి హాజరై కేక్ కట్ చేసి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ సాధించిన విజయాలు, కార్మికుల శ్రేయస్సు కోసం చేసిన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ కోశాధికారి రాయపాటి బాలసుబ్రహ్మణ్యం, డిపో సెక్రటరీ బాలవెంకటేష్, డిపో అధ్యక్షుడు రఘురాం గౌడ్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో మౌలిక వసతులు కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప జిల్లా అధికార యంత్రాంగం రిమ్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీపీఎం పార్టీ కడప నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో రిమ్స్‌లో పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా వచ్చిన సమస్యలపై త్వరలో అధికారులకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. రిమ్స్‌లో నిర్మించిన మంచినీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరిరెడ్డి, నరసింహ, జార్జి తిమ్మయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య



విద్యార్థులతో ఉపాధ్యాయులు, అతిథులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోక్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్య లభిస్తుందని ముస్లిం సమైక్యా వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కడప నగరం జామున్ బౌలిలోని నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముస్లిం సమైక్యా వేదిక ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని అప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులకు తల్లి ప్రాముఖ్యత పై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బాలాజీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ పీర్, పాఠశాల హెచ్‌ఎం ఎలిజీవత్ రాజమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణతో సురక్షిత ప్రయాణం

కడప ఎడ్యుకేషన్: వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం వద్దని, హెల్మెట్ ధారణతోనే ప్రయాణం సురక్షితమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీం బాషా పేర్కొన్నారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆయన విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ఆర్‌ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా, అధ్యాపకులు గురు మోహన్, విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్‌లో శుక్రవారం కందుల విద్యాసంస్థల అధినేత కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం అన్నదాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రిమ్స్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు రోజులు సుమారం వెయ్యి భోజన పట్లాలతోపాటు ప్రతి మనిషికి రెండు వాటర్ ప్యాకెట్లను అందిస్తున్నట్లు తెలిపారు. తమ విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛందంగా రోగులకు, సహాయకులకు భోజన పట్లాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

తెలుగుభాష పరిరక్షణకు సమష్టి కృషి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : తెలుగుభాషను పరిరక్షించుకోవడానికి సమష్టి కృషి అవసరమని వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శని, ఆదివారాల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగుభాష పరిరక్షణ సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను శుక్రవారం నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఏ శాస్త్రాన్నైనా అవగాహన చేసుకోవాలంటే మాతృభాషే సరైన మార్గమన్నారు. విద్యకు మాతృభాష, పాలనకు ప్రజల భాష శిశువుకు తల్లిపాల వంటివని పేర్కొన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ తెలుగు గ్రంథాలన్నింటినీ డిజిటలైజేషన్ చేసి ఇంటర్నెట్‌లో చేరిస్తే తెలుగుభాషకు అంతర్జాతీయ స్థాయి కల్పించిన వారమవుతామని చెప్పారు. ప్రాచీన సంపద అయిన తాళపత్రాలు పరిరక్షించుకోవాలని గ్రంథాలయ తాళపత్ర పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి తెలిపారు. విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పద్యాలు, సామెతలు,నుడికారాలను ప్రయోగించడం గొప్పతనంగా భావించాలన్నారు. భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు హరిభూషణ్, జూనియర్ అసిస్టెంట్ వెంకట రమణ, టి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పాఠశాల ఎంపికలు



రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: 2025-26 సంవత్సరంలో డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల 5వ తరగతి ప్రవేశాలకు శుక్రవారం ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సామర్థ్యం పరీక్షలను నిర్వహించారు. ఆన్‌లైన్ ప్రకారం 51 మంది విద్యార్థులు అర్హులు కాగా వారిలో 36 మంది హాజరయ్యారు. అయితే మెడికల్ టెస్ట్ పరీక్షలో ఇద్దరిని తిరస్కరించారు. ఈ ఎంపికలకు 13 మంది విద్యార్థులు హాజరుకాలేదని క్రీడా శాఖ అధికారులు తెలిపారు. క్రీడా పాఠశాలకు ఎంపికలకు 5వ తరగతిలో హాజరైన వారికి ఎత్తు, బరువు, మెడికల్ టెస్ట్, స్టాడింగ్ బ్రాడ్ జంప్, షాట్‌పుట్, 30 మీటర్ల ఫ్లెయింగ్ స్టార్ట్, రన్నింగ్ వంటి పరీక్షలను నిర్వహించారు. క్రీడా మైదానంలో ఎటువంటి సంఘటనలు జరగకండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. వివిధ కారణాలతో ఈ నెల 9న హాజరు కాని 4వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికలకు అర్హులైన విద్యార్థిని, విద్యార్థుల వివరాలు వ్యాయామ సామర్థ్యం ప్రకారం ఉత్తీర్ణులైన వారికి విజయవాడ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ త్వరలో సమాచారం అందిస్తారని తెలిపారు.

‘ఉదయపూర్ ఫైల్స్’ను నిషేధించాలి



జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మత విద్వేషంతో నిర్మించిన ‘ఉదయపూర్ ఫైల్స్’ అనే హిందీ సినిమా ప్రదర్శనను వైఎస్సార్ కడప జిల్లాతో పాటుగా రాష్ట్రవ్యాప్తంగా నిషేధించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం మత విద్వేషంతో ఇస్లాం మతం, హజరత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మహా ప్రవక్త జీవితం, వారి జీవిత భాగస్వాములను కించపరుస్తూ రూపొందించిన ‘ఉదయపూర్ ఫైల్స్, కన్నయ్య లాల్ మర్డర్’ అనే సినిమాను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ సినిమా ద్వారా ఇస్లాం మహా ప్రవక్త జీవితం పై దాడి చేయడమే కాకుండా ముస్లింల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు ఈ సినిమాపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త భాగవతి ప్రియ

కడప అగ్రికల్చర్: రైతులు అవసరం మేరకే ఎరువులను వినియోగించాలని ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానం సేద్య విభాగ శాస్త్రవేత్త భాగవతి ప్రియ పేర్కొన్నారు. ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భాగవతి ప్రియ వివిధ రకాల ఎరువులు, సూక్ష్మ పోషకాల గుర్తింపు గురించి వివరించారు. రైతులు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన మేరకే ఎరువులను వాడుకోవాలని తెలిపారు. విపరీతంగా ఎరువులను వాడటం వల్ల భూమి సమతులత్యను కోల్పోతుందన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు సూచించాలని తెలిపారు. సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ మృత్తికశాస్త్రం శాస్త్రవేత్త లీలావతిలు నేల, నీటి పరీక్ష ప్రాముఖ్యతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సహకారం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర పిలుపులో భాగంగా మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నెం. 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ బ్బులు ఇవ్వకపోవడం వల్ల 2020 నుంచి 2023 వరకు కళాశాల విద్య పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ అనేక హామీలు ఇచ్చారని, ఏడాది గడిచిపోయినా వాటిని అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అక్కిరానంద్, తేజ, జిల్లా సహాయ కార్యదర్శి పీటర్, నాయకులు అశోక్, సమంత్, లోకాభిరామ్, చాంద్, సాగర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవిజ్ఞాన సదస్సు

కడప అర్బన్: రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశాలతో జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి చైర్మన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూషకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మీడియేషన్ న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. దేశం కోసం మధ్యవర్తిత్వం అవగాహన కార్యక్రమాలను ఈనెల 10న ప్రారంభించారు. రెండవ రోజున కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు సుబ్రహ్మణ్యం, అయ్యవారప్ప, పారా లీగల్ వాలంటరీలు దశరథ రామిరెడ్డి, ఈశ్వరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలోని ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సిద్దవటం గంగమ్మ గుడి వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడికల్ కళాశాల సెక్రటరీ జవ్వాద్, ఈడీ సల్మాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, కంటి సమస్యలకు సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా మెడికల్ కళాశాల, ఆస్పత్రి వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా వాసవీమాత



శాకంబరిదేవిగా వాసవాంబ

కడప సెవెన్‌రోడ్స్ : ఆషాడ బహుళ పాడ్యమి సందర్భంగా కడప నగరం అమ్మవారిశాలలోని శ్రీ వాసవీ కన్యకాంబ ఆలయంలో శుక్రవారం వాసవీదేవి అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. శాకంబరి అలంకార ఉభయదారులు పాలెంపల్లె భాస్కర్‌గుప్తా, లక్ష్మీదేవి, నాగమణి, సాయిప్రవీణ్ ఆధ్వర్యంలో అర్చకులు రోజంతా శ్రమించి అలంకారం గావించారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులను తలపించేలా వివిధ రకాల కూరగాయలతో కనుల పండువగా అలంకరించారు. ఈ అలంకరణ చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని రిమ్స్ వద్ద ఉన్న ఐటీఐ మైనార్టీస్‌లో 2వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. పదో తరగతి పాస్ అయిన లేదా ఫెయిల్ అయిన, ఇటర్ పాస్ లేదా పెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు నేరుగా తమ 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఫొటో, మెయిల్ ఐటీ, మొబైల్ నెంబర్‌ను తీసుకుని ఐటీఐ వద్దకు వచ్చి ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం రూ. 24,500 వేతనాలు ఇవ్వకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మసాపేట తొలి గడప వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ఆరేళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి 12వ తేది అర్ధరాత్రి నుంచి వాటర్, లైటింగ్ అన్నీ బంద్ చేసి అన్ని విభాగాల కార్మికులు సమ్మెకు దిగుతారని ప్రకటించారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త

కడప కార్పొరేషన్: ‘తల్లికి వందనం’ పథకం లోకేష్ ఆలోచనల నుంచి పుట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వంత డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్తా ఎద్దేవాచేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీరు చూస్తుంటే సూర్య చంద్రులకు సైతం స్వయంగా ప్రకాశించే శక్తిని తానే ఇచ్చినట్లు నమ్మించగల మోసకారి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకానికి పేరు మార్చి అమలు చేసినంత మాత్రానా... దానికి రూపకల్పన చేసిన వైఎస్ జగన్‌ను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుపేదలందరికీ కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఈ సమావేశంలో కమలాపురం నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు జి. సాయి కుమార్ రెడ్డి, కడప నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పోస్టల్ ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ జూలై నెలకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సేల్స్ అడ్వయిజర్ ఎస్ నూర్ అహ్మద్‌కు ఉత్తమ ప్రతిభ సర్టిఫికెట్ ఒక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రజలకు ఆర్థిక భద్రతను అందించే ప్రముఖ భీమా పథకంగా ఉందన్నారు. ఇది ప్రభుత్వ హామీతో ప్రజలకు విశ్వసనీయమైన మరియు స్థిరమైన సేవలను అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పాలసీని వినియోగించుకోవాలని కోరారు. పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్, విజయ భాస్కర్ రెడ్డి, నాగూర్ రెడ్డి బాషా, మునాఫ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: విద్యుత్ ఉత్పత్తి సరఫరా పంపిణీ సంస్థలలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, మీటర్ రీడర్స్ అసోసియేషన్‌లు విద్యుత్ భవన్‌లో ఎస్ఈ రమణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మల్లికార్జున రెడ్డి, ఓ.బ్రహ్మానంద రెడ్డి, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న ఉద్యోగులు కార్మిక సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం గుర్తింపు సంఘ ఎన్నికలు నిర్వహించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు తెలంగాణ తరహాలో నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. జేఎల్ఎం గ్రేడ్-2 వారికి పాత రూల్స్ వర్తింపచేయాలని, 2022 పిఆర్సి వేతన బకాయలు చెల్లించాలన్నారు. ఈనెల 8 నుండి 21 వరకు వివిధ రూపాల్లో నిరసన తెలిపి, 21న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చలో విద్యుత్ సౌధ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు వెల్లడించారు. నాయకులు లక్ష్మీనారాయణ, ప్రతాప్ రెడ్డి, వై కృపాకర్, మల్లికార్జున పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలివ్వాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ వర్కర్లు, ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : మున్సిపల్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు చెల్లించడంతోపాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కుదిరిన సమ్మె కాలపు వేతనాలు అమలు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 10 గంటలకు పనిభారం పెంచి పరోక్షంగా వేతనాలు కుదించేందుకు మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయడం అన్యాయమన్నారు. ఇంజినీరింగ్ పార్క్ కూలీలకు, ఆఫీసు, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా రూ 21 వేల నుంచి 24,500 వేతనాలు ఇవ్వాలని, జీఓ ఎంఎస్ నెంబరు 36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 15న విజయవాడలో జరిగే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు, టి.సుబ్బరాయుడు, చంద్ర, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

కడప ఎడ్యుకేషన్: ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న కోరారు. కడప, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాల ఫీజుల దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ, ఇంటర్ బోర్డు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. శుక్రవారం కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎం.అంకన్న మాట్లాడుతూ ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థి యువజన సంఘాలు అనేక సార్లు ఫిర్యాదు చేసిన ఎటువంటి విచారణ, తనిఖీలు కూడా నిర్వహించలేదన్నారు. ఇప్పటికై నా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా నాయకుడు మహేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై నిఘా

కడప అర్బన్: నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆటకట్టించేందుకు జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. శుక్రవారం ఉదయం శక్తి టీముల ఆధ్వర్యంలో ఆయా కళాశాలలు, పాఠశాలల వద్ద బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై దృష్టి సారించారు. మహిళలను వేధించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. మహిళల భద్రత, శాంతి భద్రతలను కాపాడేందుకు కడప జిల్లా పోలీసులు నిరంతరం విజిలెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు, ఏహెచ్‌టీయూ ఎస్.ఐ శాంతమ్మ, ‘శక్తి’ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.